

ఏఎస్‌రావునగర్ డివిజన్ టీఎస్‌ఐఐసీ కాలనీలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటైన గణనాథుడిని బుధవారం రాత్రి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు కేటీఆర్‌తో కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 19 సెప్టెంబర్ 2024 | HYDERABAD




**హై టెన్షన్** బుధవారం తెలుగు తల్లి ఫ్లైఓవర్ వద్ద అంబేద్కర్ విగ్రహం వైపునకు వెళ్లే దారిలో హై టెన్షన్ తీగ ఒక్కసారిగా తెగిపడింది. అందులో కరెంటు సరఫరా ఉండటంతో ట్రాఫిక్ పోలీసులు అలర్టయ్యారు. అటు వైపు వెళ్లకుండా వాహనదారులను అప్రమత్తం చేశారు.





# ఈ పాపం ఎవరిదీ?

తల్లుల గర్భశోకం పట్టదా..?

'గాంధీ'లో మరణాలపై ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్

రాష్ట్రంలో దవాఖానల పరిస్థితులపై ఆందోళన



సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ ) : గాంధీ వైద్యశాలలో ఒక నెలలోనే 50 మంది పసిగుడ్డులు (శిశువులు), 14 మంది బాలింతలు చనిపోవడంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చలించిపోయారు. ఈ ఘటన అత్యంత బాధాకరమంటూ..ఊహించుకుంటేనే ఒళ్లు జలదరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మందికి ప్రాణం పోసిన గాంధీ వైద్యశాలలో ఇంత విషాదం ఎవరి పాపం? ఆ పసిబిడ్డల ప్రాణాలకు విలువ లేదా? ఆ తల్లుల గర్భశోకానికి జవాబు ఉండదా? అని బుధవారం కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తప్పు చేయకపోతే సర్కారు ఈ లెక్కలను ఎందుకు దాస్తున్నదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'ఆ తల్లీ, బిడ్డల ఉసురు మీకు తగలదా'? అని అన్నారు. ఒక్క గాంధీలోనే ఇన్ని మరణాలుంటే రాష్ట్రంలో పరిస్థితి ఏమిటని ఆలోచిస్తేనే.. భయంగా ఉన్నదన్నారు.

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు, డెలివరీ అయితే కేసీఆర్ కిట్లు, సిజేరియన్ కాకుండా నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యత ఇస్తూ.. తల్లీ, బిడ్డలను ఇంటి దగ్గర దిగబెట్టి వచ్చేలా కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థలను రూపొందించి అమలు చేసిందని గుర్తు చేశారు. మాతా శిశుమరణాల రేటును తగ్గించేందుకు బీఆర్‌ఎస్ సర్కారు కృషి చేసిందన్నారు. 'మరీ.. ఈ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారు? పాలన గాలికి వదిలి, ప్రచార ఆర్భాటాలు, విగ్రహ రాజకీయాలు చేస్తే ఇలాగే ఉంటుంది'. అని కేటీఆర్ మండిపడ్డారు. గాంధీలో ఒక్క ఆగస్టు నెలలోనే ఇన్ని మరణాలపై సీఎస్ శాంతికుమారి స్పందించి విచారణ జరిపించాలన్నారు.



# ఉక్కు తుక్కుపై సందిగ్ధం

నిమ్మకు నీరెత్తినట్లు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ



## రీ సైకిల్ విషయంలో రెండు శాఖల మధ్య అవగాహన లోపం

### ఆదాయం వచ్చే అవకాశమున్నా.. నిర్లక్ష్యం

గతేడాది సేకరించిన ఉక్కు వ్యర్థాలతో రూ. 12 కోట్ల ఆదాయం

పదిరోజుల్లో 8,130 మెట్రిక్ టన్నుల వ్యర్థాల తొలగింపు

*సాధారణంగా ఆదాయం వస్తుందంటే.. ఏ ప్రభుత్వ శాఖలైనా.. అధిక ప్రాధాన్యత ఇస్తాయి. ఇంకా ఆదాయం పెంచుకునేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తాయి. కానీ ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి హెచ్‌ఎండీఏ, బల్దియా శాఖలు. భక్తనీరాజనాలతో నవరాత్రులు పూజలందుకున్న గణనాథుడి విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో ఘనంగా నిమజ్జనం చేశారు. అయితే నిమజ్జనం అనంతరం భారీ సంఖ్యలో వ్యర్థాలు పోగయ్యాయి. వీటిని తొలగించే బాధ్యత హెచ్‌ఎండీఏ తీసుకున్నా.. వాటిని తరలించి.. రీసైకిల్ వ్యవహారాలన్నీ బల్దియానే పర్యవేక్షిస్తున్నది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. విగ్రహాలకు సంబంధించిన ఉక్కు వ్యర్థాలపై మాత్రం సందిగ్ధత నెలకొంది. వీటిని ఏం చేయబోతున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. రెండు శాఖల మధ్య అవగాహన కొరవడటంతో తుక్కు వ్యర్థాలపై కోట్ల ఆదాయాన్ని కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.*

*-సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ)*

**హుస్సేన్‌సాగర్‌లో** విగ్రహాలను నిమజ్జనం చేశాక ఏర్పడే వ్యర్థాల తొలగింపు బాధ్యతలు హెచ్‌ఎండీఏ తీసుకున్నది. వాటిని తరలించి, రీసైకిల్ పనులను బల్దియానే పర్యవేక్షిస్తున్నది. అలాగే నగరంలోని ఇతర చెరువుల్లో వ్యర్థాల తొలగింపు బాధ్యతను జీహెచ్‌ఎంసీ తీసుకున్నది. హుస్సేన్ సాగర్ నుంచి తొలగించిన వ్యర్థాలను బల్దియానే తరలిస్తున్నది. కానీ హెచ్‌ఎండీఏ, బల్దియా మధ్య సమన్వయ లోపం కారణంగా విగ్రహాలకు సంబంధించిన ఇనుము వ్యర్థాలను ఏం చేయబోతున్నారనేది తెలియాలి. రూ. 5 లక్షల లోపు విలువ చేసే పనులకు టెండర్లు లేకుండానే కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనులు అప్పగించే వీలు ఉండగా, ఇదే ప్రాతిపదికన కోట్లు విలువ చేసే ఐరన్ వ్యర్థాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది చర్చనీయాంశంగా మారింది. గతేడాది తొలగించిన 4వేల టన్నుల ఐరన్ వ్యర్థాలతో జీహెచ్‌ఎంసీకి రూ. 12 కోట్ల ఆదాయం సమకూరింది. కానీ హెచ్‌ఎండీఏ పరిధిలో హుస్సేన్ సాగర్‌లోని వ్యర్థాలతో వచ్చే ఆదాయం విషయంలోనే అసలు సమస్య నెలకొంది. ఇరు సంస్థల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇనుము వ్యర్థాల ద్వారా ఆదాయం విషయంలో సందిగ్ధత నెలకొన్నది.



## రెండోరోజూ నిమజ్జనం



సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గతేడాదిలాగానే ఈ సారి కూడా రెండో రోజు వినాయక నిమజ్జనం కొనసాగింది. త్వరగా విగ్రహాలను తరలించేందుకు పోలీసులు మండపాల నిర్వాహకులతో మాట్లాడినా.. రెండోరోజూ ప్రక్రియ సాగింది. మంగళవారం సెంటిమెంట్‌తో అర్ధరాత్రి తరువాత చాలా మంది వినాయకులను నిమజ్జనానికి తరలించారు. దీంతో హుస్సేన్‌సాగర్ వైపు గణనాథులు బారులు తీరాయి. కొన్ని చోట్ల భారీ వాహనాలు మొరాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఇలాంటి కారణాలతోనే విగ్రహాల నిమజ్జనాలు రెండ్రోజులు కొనసాగాయి. బుధవారం వర్కింగ్ డే కావడంతో బారులు తీరిన గణనాథులతో సామాన్య ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేలా పోలీసులు చర్యలు చేపట్టారు. వేగంగా నిమజ్జనాలు చేయిస్తూ.. 10.30 వరకు ప్రధాన రోడ్లలోని వినాయక విగ్రహాలను ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు వైపునకు మళ్లించారు.

## చకచకా వ్యర్థాల తరలింపు



సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): వినాయక నిమజ్జనం సందర్భంగా వెలువడిన వ్యర్థాల వెలికితీత పనులను పూర్తి చేసి 'క్లీన్ హుస్సేన్ సాగర్'గా మార్చేందుకు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ చర్యలు వేగవంతం చేశాయి. వినాయక విగ్రహాల తాలూకు వ్యర్థాల తొలగింపు పనులు నిర్విరామంగా కొనసాగిస్తున్నాయి. నిమజ్జనం అయిన వెంటనే విగ్రహాలు, వాటికి సంబంధించి అవశేషాలు, పూలు, పత్రి ఇతర చెత్తా చెదారాన్ని వెనువెంటనే తొలగించారు. బుధవారం రాత్రి వరకూ హెచ్‌ఎండీఏ 5500 మెట్రిక్ టన్నులు, 10 రోజుల్లో రోజుకు సరాసరి 8,130 మెట్రిక్ టన్నులు వ్యర్థాలను తొలగించినట్లు బల్దియా అధికారులు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా పెద్దఎత్తున ఏర్పడిన చెత్త, వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు కృషి చేశామని, మండపాలు, 73 కొలనుల వద్ద చెత్త సేకరణకు 3వేల మంది పారిశుధ్య కార్మికులు 24 గంటల పాటు పనిచేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## నిమజ్జనం ప్రశాంతం : కమిషనర్



సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ): గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగిందని, అన్ని శాఖల సమన్వయంతోనే సాధ్యమైందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో డిప్యూటీ కమిషనర్లు, యూబీడీ, యూసీడీ, పోలీస్, విద్యుత్ విభాగాల అధికారులు శోభాయాత్ర సందర్భంగా ఎదురయ్యే సమస్యలను ముందుగా గుర్తించి.. రోడ్డు మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించడం, విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు చేపట్టబోయే పనులు విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. గురువారం జరిగే మిలాద్- ఉన్ -నబీ వేడుకలు చార్మినార్‌లో నిర్వహించే అవకాశం ఉన్నందున ప్రధాన, అంతర్గత రోడ్లు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలో అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందని, వారి సేవలు అభినందనీయమని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు.



సురగు రాములు

## కూతురుతో అసభ్య ప్రవర్తన..

## తండ్రికి ఏడేండ్ల జైలు

మల్కాజిగిరి, సెప్టెంబర్ 18: మద్యం మత్తులో కూతురు పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తండ్రికి ఏడేండ్ల జైలు శిక్ష పడింది. మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. నర్సింహారెడ్డినగర్‌కు చెందిన సురగు రాములు (52) ప్లంబర్. 2019, ఏప్రిల్ 11న మద్యం మత్తులో ఇంట్లో తన కూతురుతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు.. రాములుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన స్పెషల్ జడ్జి నిందితుడికి ఏడేండ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించారు.

## కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

గ్రీన్ ఫీల్డ్ కాలనీ వాసుల డిమాండ్

ఖైరతాబాద్: సర్కారు భూమికి పట్టాలిచ్చిన అధికారులు, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రీన్ ఫీల్డ్ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాలనీ వాసులు శ్రీనివాస్‌రెడ్డి, గురువారెడ్డి, జీవీవీఎస్ మూర్తి మాట్లాడారు. అల్వాల్ మండలం కానోజిగూడలో సర్వే నంబర్లు 373, 375, 376, 378, 379, 381, 386లలో 62.16 గుంటల భూమిని ఇనామ్‌దార్‌గా ఉన్న సయ్యద్ అక్బర్ నిజాముద్దీన్ హుస్సేన్ నివాస స్థలాలుగా మార్చి.. 1985 నుంచి 1992 వరకు ప్రైవేట్, ప్రభుత్వ రంగ ఉద్యోగులకు విక్రయించారన్నారు. ఈ స్థలాలను అభివృద్ధి చేసేందుకు గ్రీన్ ఫీల్డ్ కాలనీ ఏ, బీ వెంచర్లుగా నామకరణం చేశామన్నారు. 875 ప్లాట్లలో కొందరు అనుమతులు తీసుకొని ఇండ్లు నిర్మించుకోగా, ప్రస్తుతం 250 ప్లాట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. అయితే తమ సర్వే నంబర్లకు ఆనుకొని ఉన్న సర్వే నం. 385లోని సుమారు ఐదెకరాల సర్కారు భూమిని కొందరు ఆక్రమించుకొని పట్టాలు సైతం చేసుకున్నారన్నారు. ఈ స్థలాన్ని 166 జీవో ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని కోరామని, ప్రస్తుతం కోర్టులో స్టేటస్ కో ఇచ్చారన్నారు. ఈ సర్కారు భూమిని ఆక్రమించుకున్న వారికి అధికారులు అక్రమాలకు పాల్పడి పట్టాలిచ్చారని ఆరోపించారు. ఈ కబ్జా వ్యవహారంపై విచారణ జరిపించి, అవినీతి అధికారులు, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




వివరాలు వెల్లడిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి



## 'మిలాద్ ఉన్ నబీ' ర్యాలీ

# ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : మిలాద్ ఉన్ నబీ సందర్భంగా గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఊరేగింపులు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఫలక్‌నుమా నుంచి వోల్టా హోటల్, యాహియా పాషా దర్గా నుంచి వోల్టా హోటల్ వరకు, మక్కా మసీదు నుంచి హజ్ హౌస్, పత్తర్‌గట్టి అలీజా కోట్ల వరకు ఊరేగింపులు ఉండనున్నాయి. ప్రధాన ఊరేగింపు సయ్యద్ క్వాద్రీ చమన్, గులాం ముర్తుజా కాలనీ, ఫలక్‌నుమా నుంచి ప్రారంభం కానున్నది. అలియాబాద్ ఎక్స్ రోడ్స్, లాల్ దర్వాజా ఎక్స్ రోడ్స్, చార్మినార్, గుల్జార్ హౌస్, మదీనా, నయాపూల్ బ్రిడ్జి, సాలార్జంగ్ మ్యూజియం, పురానీ హవేలీ మీదుగా ర్యాలీ ఉంటుంది. బీబీ బజార్, ఎటెబార్ చౌక్‌ల్లో ర్యాలీ ముగియనున్నది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌ను మహబూబ్‌నగర్ ఎక్స్ రోడ్ మీదుగా కందికల్ గేట్, పీసల్‌బండ, కర్నూలు రోడ్డు వైపునకు, శంషీర్‌గంజ్, నాగుల చింత మీదుగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాకపోకల్లో ఏదైనా ఇబ్బందులు తలెత్తితే 9010203626 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

# అందరికీ ధన్యవాదాలు

హుస్సేన్‌సాగర్‌లో లక్ష విగ్రహాలు నిమజ్జనం

నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

సిటీబ్యూరో: గతేడాదితో పోలిస్తే మూడు గంటల ముందే నిమజ్జన ప్రక్రియ పూర్తయిందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. ఉదయం 10.30 గంటల వరకు ట్రాఫిక్ జంక్షన్లు అన్ని క్లియర్ చేసినట్లు చెప్పారు. బుధవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రణాళిక ప్రకారం నిమజ్జనం పూర్తి చేశామన్నారు. నెక్లెస్‌రోడ్, ఐమాక్స్ మైదానాల్లో విగ్రహాలతో ఉన్న లారీలను పార్కింగ్ చేయించి.. సాధారణ పౌరులకు రూట్ క్లియర్ చేసినట్లు కమిషనర్ చెప్పారు. ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం అనుకున్న సమయానికే పూర్తయిందన్నారు. నిమజ్జన ఘట్టంలో పాల్గొన్న ప్రతి ఒక్క పోలీస్ సిబ్బందికి సీపీ సీవీ ఆనంద్ ధన్యవాదాలు తెలిపారు. కొన్ని వాహనాలు బ్రేక్ డౌన్ కావడం వల్ల నిమజ్జనాలు కొంత ఆలస్యమయ్యాయని, లేదంటే ఉదయం 7 గంటల వరకు అంతా పూర్తయ్యేదని సీపీ చెప్పారు. 11 రోజుల్లో కేవలం హుస్సేన్‌సాగర్‌లోనే లక్ష విగ్రహాలు నిమజ్జనమైనట్లు వెల్లడించారు.



తెలుగు తల్లి ఫ్లైఓవర్ వద్ద నిమజ్జన ఘట్టాన్ని పరిశీలిస్తున్న నగర సీపీ సీవీ ఆనంద్